### గొప్పగా ఎదగాలి: డీఈవో

కోటపల్లి, నవంబర్ 3: గ్రామీణ విద్యార్థులు ఇష్టంగా చదువుకొని గొప్పగా ఎదగాలని జిల్లా విద్యాధికారి యాదయ్య సూచించారు. కోటపల్లి కేజీబీవీ, సర్వాయిపేట ప్రాథమిక పాఠశాల, పారుపల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం డీఈవో యాదయ్య సందర్శించి స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే (స్వీస్) పరీక్షలను తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణను పరిశీలించిన డీఈవో అనంతరం తరగతులను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పాఠశాలలో విద్యా బోధన, మధ్యాహ్న భోజన నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. విద్యా బోధన, ఉత్తమ ఫలితాల సాధన పై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఎంఈవో తిరుపతి రెడ్డి, జిల్లా సెక్టోరియల్ అధికారి చౌదరి, నోడల్ అధికారి సీహెచ్ మొగిలి, పారుపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గుండేటి యోగేశ్వర్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హరిత, సర్వాయిపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వారణాసి నాగేందర్, సీఆర్పీ సంపత్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి

బెల్లంపల్లి, నవంబర్ 3: సింగరేణి ఏరియా దవాఖానలో మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నట్లు సీఎంవో సీహెచ్ సుజాత తెలిపారు. శుక్రవారం ఆమె సింగరేణి ఏరియా దవాఖానను తనిఖీ చేశారు. వార్డుల్లో కలియ తిరిగి పరిశీలించారు. దవాఖానలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దవాఖానకు పూర్వ వైభవం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అన్ని విధాలుగా వైద్య సదుపాయాలు కల్పించి కార్మికులకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. దవాఖానను ఎత్తివేసే సమస్యే లేదని స్పష్టం చేశారు. ప్రత్యేక వైద్య నిపుణులు, ఇతర వైద్య సిబ్బందిని భర్తీ చేస్తేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్మిక కుటుంబాలకు వైద్య సేవలకు లోటు లేకుండా దవాఖానను తీర్చిదిద్దుతామని తెలిపారు.

### ప్రభుత్వ వైద్య సేవల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి

మందమర్రి, నవంబర్ 3: ప్రభుత్వ దవాఖానలలో అందిస్తున్న వైద్య సేవల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య, ఆరోగ్య శాఖ రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాస రావు వైద్య సిబ్బందికి సూచించారు. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని దీపక్ నగర్‌లో గల పల్లె దవాఖానతో పాటు మండల పరిధిలోని కోటేశ్వర్‌రావు పల్లె, పొన్నారం, రామకృష్ణాపూర్‌లో గల పల్లె దవాఖానలను ఆయన శుక్రవారం సందర్శించి పరిశీలించారు. పల్లె దవాఖానలలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దవాఖాన పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రసవాలు, నవజాత శిశువులకు సేవలు, కౌమార దశ పిల్లలకు సేవలు, కుటుంబ నియంత్రణ కార్యక్రమం, సంక్రమణ వ్యాధులు, కీటకజనిత వ్యాధులు, అసంక్రమణ వ్యాధుల గురించి సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో సుబ్బారాయుడు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విజయనిర్మల, డాక్టర్ శివప్రతాప్, డాక్టర్ రమేశ్, డాక్టర్ భవాని, డీపీవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తులకు ఆహ్వానం

రెబ్బెన, నవంబర్ 3: బెల్లంపల్లి ఏరియాలో వివిధ గనులు, డిపార్టుమెంట్లలో యూనిట్ రేట్ సిస్టం ప్రకారం అద్దె ప్రతిపాదికన మూడేళ్ల పాటు వినియోగించడం కోసం 8 వాహనాలకు ఆసక్తి గల వారి నుంచి టెండర్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సింగరేణి అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 2డబ్ల్యూడీ, 4 డబ్ల్యూడీ వీల్ డ్రైవ్ వాహనాల కోసం ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. భూ నిర్వాసితుల కుటుంబాలకు మొదటి ప్రాధాన్యమివ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు పూర్తి వివరాల కోసం గోలేటి జీఎం కార్యాలయంలోని పర్చేస్ డిపార్టుమెంట్ లేదా కంపెనీ వెబ్‌సైట్ www.scclmines.com ను సందర్శించాలని సూచించారు.

# పట్టాల హామీ నెరవేర్చా.. పట్టం కట్టండి

■ **బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య**



మాట్లాడుతున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, నవంబర్ 3: బెల్లంపల్లి పట్టణంలో సింగరేణి స్థలాల్లో ఇల్లు నిర్మించుకున్న వారికి ఇళ్ల పట్టాల పంపిణీ అనే చిరకాల వాంఛను తీర్చాను. మూడో సారి ఆదరించి తనకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బెల్లంపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కోరారు. బెల్లంపల్లి పట్టణంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ముందుగా సుభాష్‌నగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచార శంఖారావాన్ని పూరించారు. మున్సిపాలిటీ పరిధిలోని 5, 6, 7, 8 వార్డుల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి వార్డులో వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కొన్ని దశాబ్దాలుగా ఇళ్ల పట్టాల సమస్య పరిష్కారానికి నోచుకోలేదని, అప్పటి పాలకులు పట్టాల పంపిణీని ఏ మాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. బెల్లంపల్లి ఓపెన్ కాస్టును బూచిగా చూపి నాయకులు చేతులెత్తేశారని విమర్శించారు. ఇళ్ల పట్టాల సమస్య తీవ్రతను గమనించిన తాను సీఎం, సింగరేణి సీఎం అండ్ ఎండీ దృష్టికి తీసుకువచ్చి గత ఐదారేండ్లుగా కృషి చేశానని వివరించారు. చివరకు సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో ఇక్కడి ప్రజలకు సింగరేణి పట్టాలు దక్కాయని తెలిపారు. ఇప్పటికే సింగరేణి పట్టాల పంపిణీ ప్రక్రియ తుది దశకు వచ్చిందని, ఇప్పటికీ పట్టాలు అందని వారికి ఎన్నికల ప్రక్రియ ముగియగానే అందజేస్తామని స్పష్టం చేశారు. సింగరేణి పట్టాలు అందించిన తనకు మాత్రమే బెల్లంపల్లిలో ఓటు అడిగే హక్కు ఉందని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా సీఎం కేసీఆర్ తనను ఆశీర్వదించి బీఆర్‌ఎస్ టికెట్ కేటాయించారని గుర్తించారు. నోట్ల కట్టలతో వచ్చే బడా వ్యాపారులను



మాట్లాడుతున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

నమ్మకుండా స్థానికంగా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే వారికే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. వాళ్ల బలం నోట్ల కట్టలది అయితే, నా బలం పేద ప్రజల ఆశీర్వాదమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్‌ను ఆదరించాలి**

సీఎం కేసీఆర్ అవలంబిస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు కొనసాగాలంటే రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు ఆదరించాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పిలుపునిచ్చారు. 8వ వార్డు శాంతిఖని బస్తీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో నెన్నెల మండలం ఆవడం గ్రామానికి చెందిన పలువురు ఇతర పార్టీలకు చెందిన నాయకులు, 7వ వార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సంక్షేమ పరంపరను మరింతగా కొనసాగించాలనే కృతనిశ్చయంతో అద్భుతమైన ఎన్నికల మ్యానిఫెస్టోను సీఎం కేసీఆర్ తీసుకువచ్చారని తెలిపారు. ప్రభుత్వం అన్ని వర్గాల వారిని కాపాడుకుంటుందని, రాబోయే రోజుల్లోనూ అదే పద్ధతిని కొనసాగిస్తుందని వెల్లడించారు. ప్రతి కుటుంబానికి జీవిత బీమా ప్రకటించడం దేశంలో ఎక్కడా కూడా లేదని గుర్తు చేశారు. రైతు బంధును ఐదేళ్లలో రూ.16వేలు చేస్తారని వివరించారు. బెల్లంపల్లి, నెన్నెల మండల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే సతీమణి జయతార ఎన్నికల ప్రచారం**

బీఆర్‌ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్య సతీమణి జయతార శుక్రవారం బెల్లంపల్లి పట్టణంలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మున్సిపాలిటీ పరిధిలోని 4, 19 వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేతతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. మహిళాభ్యున్నతికి సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు దేశానికి ఆదర్శమని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలో కేసీఆర్ మహిళల సంక్షేమం కోసం పెద్దపీట వేశారని గుర్తు చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి మూడోసారి బెల్లంపల్లిలో దుర్గం చిన్నయ్యను గెలిపించుకోవాలని కోరారు. మున్సిపల్ కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

**ప్రతి ఇంట్లో సంక్షేమ పథకాలు**

ప్రతి ఇంట్లో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందుకున్నారని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలిపారు. శుక్రవారం రాత్రి మున్సిపాలిటీ పరిధిలోని 9, 24, 25, 26 వార్డుల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తాయని ఎమ్మెల్యే వెల్లడించారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న నస్పూర్ చైర్మన్ ప్రభాకర్, యువ నాయకులు విజిత్ రావు

# పట్టాలిప్పించిన బీఆర్‌ఎస్‌నే గెలిపించాలి

■ **నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, యువ నాయకుడు విజిత్ రావు**

శ్రీరాంపూర్, నవంబర్ 3: సింగరేణి స్థలాల్లో నివాసం ఉంటున్న వారందరికీ పట్టాలు ఇప్పించిన బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఇసంపెల్లి ప్రభాకర్ పేర్కొన్నారు. నస్పూర్ ఏరియా 17వ వార్డు శ్రీరాంపూర్ ఆర్కే 6గుడిసెలు, గాంధీ నగర్, హిమ్మత్‌నగర్‌లో ఇంటింటా బీఆర్‌ఎస్ నాయకులు, నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు శుక్రవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచిర్యాల నియోజక వర్గంలో గుండాలకు, మోసగాళ్లకు చోటు లేదన్నారు. ప్రజలకు నకిలీ ఇళ్ల పట్టాలు ఇచ్చి మోసం చేసిన ప్రేమ్‌సాగర్‌రావుకు ప్రజలు ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలన్నారు. నీతికి, నిజాయితీకి మారుపేరుగా ఉన్న దివాకర్‌రావుకు ప్రజలు ఓటేసి కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా నిలబెట్టాలని కోరారు. వాడవాడలా వార్డు అధ్యక్షుడు ఎండీ రఫీఖ్‌ఖాన్ ఆధ్వర్యంలో మహిళలు విజిత్‌రావు మంగళహారతులు పట్టి కారుగుర్తుకు ఓటు వేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి మెరుగు పవన్, మహిళా అధ్యక్షురాలు రౌతు రజిత, వార్డు మహిళా అధ్యక్షురాలు వైద్య శ్రీలత, టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు అన్నయ్య, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు బెడిక లక్ష్మి, బౌతు లక్ష్మి, చీడం మహేశ్, మాజీ సర్పంచ్ గుంట జగ్గయ్య, జక్కుల రాజేశం, నాయకులు రవి, స్వామి, ధర్ని శంకర్, రమణ, శ్రీనివాస్, ఎర్రయ్య, చెవుల స్వాతి, బండి తిరుపతి, తిరుమల్‌రావు, పెద్దపల్లి రామన్న, సూర్యకుమారి, నోముల నరేందర్‌రెడ్డి, ప్రశాంత్, రౌతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్కే 7లో గాయపడిన కార్మికుడి మృతి

శ్రీరాంపూర్, నవంబర్ 3: ఆర్కే 7గనిలో గురువారం సాయంత్రం ప్రమాదవశాత్తు పడి ఫిట్టర్ కార్మికుడు మృతి చెందాడు. ఆర్కే 7గనిలో మధ్యాహ్నం మిడిల్ షిఫ్ట్‌లో ఫిట్టర్ విధులు నిర్వహిస్తున్న సుర్విళ్ల వెంకటేశ్(35) కార్మికుడు ఒక్కసారిగా ప్రమాదవశాత్తు కిందపడ్డారు. ట్రావెలింగ్ రోల్‌పై పై పడటంతో వెంకటేశ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంటనే తోటి కార్మికులు స్థానిక ఏరియా దవాఖానకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కోమాలోకి వెళ్లి మృతి చెందినట్లు తెలిపారు. కార్మికుడిని మంచిర్యాల ప్రైవేట్ దవాఖానకు తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. వెంకటేశ్‌కు భార్య ప్రవంతి, ఒక కుమారుడు, ఒక కూతురున్నారు. కార్మికుడు నస్పూర్ సీసీసీ ఆర్కే 5కాలనీలో నివాసం ఉంటున్నారు. విషయం తెలుసు కున్న ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, జీఎం సంజీవరెడ్డి, మేనేజర్ సాయి ప్రసాద్, కార్మికుడి మృతి పట్ల టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి మెండ వెంకటి, ఏరియా చర్చల ప్రతినిధి వెంగళ కుమారస్వామి వెళ్లి కార్మికుడి మృతదేహాన్ని సందర్శించి విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను కలిసి సంతాపాన్ని తెలిపారు. కుటుంబ సభ్యులకుప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. కార్మికుడికి సంస్థ నుంచి రావాల్సిన బెనిఫిట్స్ అందేలా చూస్తామని తెలిపారు. ప్రమాదంపై గని అధికారులు విచారణ చేస్తున్నారు.

**చికిత్స పొందుతూ మృతి**

గర్మిళ్ల, నవంబరు 3: మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సింగరేణి ఉద్యోగి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు మంచిర్యాల పట్టణ ఎస్‌ఐ జగదీశ్ తెలిపారు. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన ఆరెపల్లి శివ వెంకట సాయి (25) మంచిర్యాలలోని ప్రైవేటు దవాఖానలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న తన స్నేహితుడిని చూసి తిరిగి మందమర్రికి వెళ్తుండగా గురువారం రాత్రి స్థానిక లక్ష్మీ టాకీస్ వద్ద కొత్తగా నిర్మిస్తున్న ఐ లాండ్‌ను ఢీ కొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడని, బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.